ఓజోన్ పొరను రక్షించుకుందాం

● టీజీపీసీబీ సభ్య కార్యదర్శి రవి



విద్యార్థులకు ప్రశంసాపత్రాలను అందజేస్తున్న రవి

హైదరాబాద్ సిటీ, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఓజోన్ పొరను రక్షించుకునేందుకు పర్యావరణ అనుకూల ఉత్పత్తులను ఉపయోగించడం, సింగిల్-యూజ్ ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించడం వంటి స్థిరమైన జీవనశైలిని ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి(టీజీపీసీబీ) సభ్యకార్యదర్శి రవి అన్నారు. అంతర్జాతీయ ఓజోన్ దినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం సనత్‌నగర్‌లోని టీజీపీసీబీ ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఓజోన్ పొరను క్షీణింపజేసే పదార్థాలను నిర్మూలించడంపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. 'సూర్యుడి నుంచి వచ్చే హానికర అల్ట్రావయొలెట్ కిరణాల నుంచి ఓజోన్ పొర భూమికి రక్షణ కవచంలా ఉంటుందన్నారు. క్లోరోఫ్లోరో కార్బన్లు, హైడ్రో క్లోరోఫ్లోరో కార్బన్ల వంటి రసాయనాలు ఓజోన్ పొరను క్షీణింపజేస్తాయని, ఫలితంగా చర్మ క్యాన్సర్, కంటి వ్యాధులు వస్తాయని తెలిపారు. పర్యావరణ శాస్త్రవేత్త నాగేశ్వరరావు మాట్లాడుతూ ఓజోన్ క్షీణత, పర్యావరణంపై ప్రభావం గురించి వివరించారు. అలాగే, మాంట్రియల్ ప్రోటోకాల్‌పై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. కార్యక్రమంలో పలువురు పర్యావరణ శాస్త్రవేత్తలు, పీసీబీ ఉన్నతాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

భారతీయ సంస్కృతిలో చేనేత కళలు ప్రధానం

● ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్

బంజారాహిల్స్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): భారతీయ సంస్కృతిలో చేనేతకళలు ప్రధానమైనవని, కళాత్మక నైపుణ్యానికి, నాణ్యమైన పట్టు ఉత్పత్తులకు వేదికగా ఇండియన్ సిల్క్ గ్యాలరీ నిలుస్తుందని తెలంగాణ హ్యాండ్లూమ్ టెక్స్‌టైల్స్, ఎండోమెంట్ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్ అన్నారు. శ్రీనగర్ కాలనీలోని సత్యసాయి నిగమాగమంలో ఇండియన్ సిల్క్ గ్యాలరీ పేరిట ఏర్పాటు చేసిన సిల్క్ ఎగ్జిబిషన్‌ను మంగళవారం ఆమె నగర సోషలైట్, ఎంటర్‌ప్రెన్యూర్ శైలజారెడ్డితో కలిసి ప్రారంభించారు. చేనేతకళాకారుల ఉత్పత్తులను తిలకించి వారిని అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తెలంగాణ చేనేత కళాకారులకు పొదుపు, బీమాతోపాటు జాతీయ, అంతర్జాతీయస్థాయిలో ఉత్పత్తులను మార్కెటింగ్ చేస్తూ వారి అభ్యున్నతికి కృషి చేస్తున్నామన్నారు. ఇండియన్ సిల్క్ గ్యాలరీలో నాణ్యమైన పట్టు, కాటన్ వస్త్రాలు లభిస్తాయని, దేశంలోని అన్నిప్రాంతాల చేనేత కళాకారులను ఒకచోట చేర్చి వారి ఉత్పత్తులను నేరుగా వినియోగదారులకు అందిస్తున్న నిర్వాహకులు శ్రీనివాసరావు, వినయ్ కుమార్‌ను అభినందించారు. మినిస్ట్రీ ఆఫ్ టెక్స్‌టైల్స్ సహకారంతో చేనేత కళాకారుల ఉత్పత్తులను ఈ ఎగ్జిబిషన్‌లో వినియోగదారులకు అందుబాటులో ఉంచామని, దేశంలోని ప్రముఖ నగరాలకు చెందిన చేనేత కళాకారులు వారి ఉత్పత్తులను సుమారు 80స్టాళ్లలో ఏర్పాటు చేశామని సిల్క్ ఇండియా సీఈఓ వినయ్ కుమార్ తెలిపారు. దసరా, దీపావళి శుభ కార్యాలకు అనువుగా పోచంపల్లి, మదనపల్లి, గద్వాల, వెంకటగిరి, చెందేరి, ఇక్కత్, నారాయణపేట్, బెనారస్, కోల్‌కత్తాతో పాటు పలు నగరాలకు చెందిన విభిన్నమైన, అరుదైన చీరలను స్టాల్స్‌లో ఏర్పాటు చేశామని, ఈనెల 23 వరకూ ఎగ్జిబిషన్ ఉంటుందని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో ఎడ్యుకేషన్ కన్సల్టెంట్ ఇంద్ర గుమ్మళ్ల, ఇండియా సిల్క్ గ్యాలరీ సిబ్బంది పాల్గొన్నారు.



చేనేత ఉత్పత్తులను పరిశీలిస్తున్న శైలజా రామయ్యర్

మాగంటి ఆశయాలను సాధిస్తా : సునీత



స్థానిక మహిళలతో మాట్లాడుతున్న మాగంటి సునీత

బోరబండ, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): దివంగత ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ ఆశయాలను సాధించాలనే ఉద్దేశ్యంతోనే రాజకీయాల్లోకి అడుగుపెట్టినట్టు ఆయన సతీమణి మాగంటి సునీత తెలిపారు. బీఆర్ఎస్ బోరబండ డివిజన్ కార్యకర్తలతో కలిసి సైట్-1 కాలనీ, రాజ్‌నగర్, మధురానగర్‌లో స్థానికులను మంగళవారం ఆమె పలకరించారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో గులాబీజెండా ఎగరవేయడమే లక్ష్యమని తెలిపారు. ఉప ఎన్నికల్లో గెలుపే మాగంటికి అసలైన నివాళి అని గుర్తు చేశారు. కార్యకర్తలు నిరుత్సాహ పడాల్సిన అవసరం లేదని, తాను ప్రతీ నిత్యం అందుబాటులో ఉంటానని తెలిపారు. సమావేశంలో బీఆర్ఎస్ బోరబండ డివిజన్ అధ్యక్షుడు టి.కృష్ణమోహన్, సీనియర్ నాయకులు ఎన్.విజయ కుమార్, ఎం.ఆనంద్ కుమార్, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.



నివేశ్ బస్ యాత్రను ప్రారంభిస్తున్న రజనీష్ నరులా

తెలుగు రాష్ట్రాల్లో 'నివేశ్ బస్ యాత్ర'

హైదరాబాద్ సిటీ, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): పెట్టుబడిదారులకు అవగాహన కల్పించడమే ధ్యేయంగా కెనరా రోబెకో అసెట్ మేనేజ్‌మెంట్ కంపెనీ లిమిటెడ్ మంగళవారం 'నివేశ్ బస్ యాత్ర'ను ప్రారంభించింది. సోమాజిగూడలో జరిగిన ఒక కార్యక్రమంలో సంస్థ అధికారులు ఈ బస్‌ను లాంచనంగా ప్రారంభించారు. తెలుగు రాష్ట్రాల్లోని హైదరాబాద్, కర్నూలు, అనంతపురం, తిరుపతి, నెల్లూరు, గుంటూరు, విజయవాడ, విశాఖపట్నంలో దాదాపు నెల రోజులపాటు ఈ బస్సు తిరగనుండడంతో పాటుగా స్థానిక నివాసితులకు పెట్టుబడుల పట్ల అవగాహన కల్పించనుందని కెనరా రోబెకో ఏఎంసీ మేనేజింగ్ డైరెక్టర్, చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ రజనీష్ నరులా అన్నారు. ఇప్పటికే కేరళ, పంజాబ్, పశ్చిమ బెంగాల్, తమిళనాడు, కర్నాటకలో ఈ బస్సు యాత్ర చేశామని, ఇప్పుడు తెలుగు రాష్ట్రాలకు ఈ యాత్ర చేరుకుందని తెలిపారు.

నవంబరు 1న
ఎన్ఎస్ఎన్ కరాటే ప్రీమియర్ లీగ్-2025

బంజారాహిల్స్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): కరాటే ఇండియా అసోసియేషన్, తెలంగాణ స్టేట్ కరాటే కో అసోసియేషన్, ఎన్ఎస్ఎన్ కరాటే అసోసియేషన్ ఆఫ్ ఇండియా సంయుక్తాధ్వర్యంలో ఎన్ఎస్ఎన్ కరాటే లీగ్-2025 సీజన్ పోటీలు నవంబరు 1న జరగనున్నాయి. యూసుఫ్‌గూడలోని కోట్ల విజయభాస్కర్‌రెడ్డి స్టేడియంలో జరిగే పోటీల పోస్టర్‌ను జూబ్లీహిల్స్‌లో బ్రాండ్ అంబాసిడర్, సామాజికవేత్త కె.సిద్దారెడ్డి, సినీనటుడు ఇంద్రసేన, జాతీయ కరాటే జట్టు కోచ్ కీర్తన్ మంగళవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో నిర్వాహకులు పి.నాని, మాస్టర్ శ్రీపాల్‌రెడ్డి, మాస్టర్ నరేష్ పాల్గొన్నారు.

చెక్కును అపహరించి నగదు విత్ డ్రా

● బోరబండ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆఫ్‌లైన్ మోసం

బోరబండ, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఆన్‌లైన్ మోసాలు పెరుగుతున్న తరుణంలో బ్యాంక్ డ్రాప్ బాక్స్‌లో వేసిన చెక్కును మోసంతో పొందిన వ్యక్తి దర్జాగా నగదు డ్రా చేసుకున్నాడు. బోరబండ పోలీస్‌స్టేషన్ పరిధిలోని కెనరా బ్యాంక్‌లో ఈ సంఘటన జరిగింది. బ్యాంక్ చీఫ్ మేనేజర్ నికేత్ సత్యవాన్ సహారే తెలిపిన వివరాల ప్రకారం... ఫతేనగర్ ప్రాంతంలోని ప్రైవేట్ సంస్థలో పనిచేసే యాదయ్యకు వేతనం కింద సంస్థ యాజమాన్యం రూ.42 వేల యూనియన్ బ్యాంక్ చెక్కును అందజేసింది. ఆ చెక్కును ఈ నెల 4న యాదయ్య కొడుకు కెనరా బ్యాంక్ బోరబండ శాఖలోని డ్రాప్ బాక్స్‌లో వేశాడు. పారదర్శకంగా ఉన్న డ్రాప్ బాక్స్ నుంచి సెల్ ఫోన్‌లో చెక్కు ఫొటో తీసిన ఆగంతకుడు చెక్కులో మార్పులు చేయాలని బ్యాంక్ అధికారులను నమ్మించి డ్రాప్ బాక్స్ నుంచి తీసుకున్నాడు. మరో డిపాజిట్ ఫారంలో చెక్కు వివరాల కౌంటర్ ఫైల్‌ను చూపించడంతో బ్యాంక్ అధికారులు కూడా అతడికి చెక్కు అందచేశారు. ఆ చెక్కును యూనియన్ బ్యాంక్ ఫతేనగర్ శాఖలో మార్చి ఆగంతకుడు నగదు డ్రా చేసుకున్నాడు. డ్రాప్ బాక్స్‌లో వేసిన చెక్కు క్లియర్ కాకపోవడంతో సదరు ఖాతాదారుడు కెనరా బ్యాంక్‌కు వెళ్లి ఆరా తీశాడు. దీంతో సీసీటీవీ ఫుటేజీని పరిశీలించగా ఆగంతకుడు చెక్కును తీసుకున్నట్లు గుర్తించారు. బ్యాంక్‌లో రద్దీ ఎక్కువగా ఉండడమే కాకుండా కౌంటర్ ఫైల్ చూపించినందుకు ఆగంతకుడికి చెక్కును ఇచ్చినట్లు బ్యాంకు చీఫ్ మేనేజర్ తెలిపారు. క్రాస్ చేసిన చెక్కుపై ఖాతాదారుడి పేరు ఉన్నప్పటికీ, మార్పులు చేర్పులు చేసిన చెక్కును సరిగ్గా పరిశీలించకుండా యూనియన్ బ్యాంక్ సిబ్బంది ఆగంతకుడికి నగదు ఇవ్వడం సమంజసం కాదని చెప్పారు. బాధితుడి ఫిర్యాదు మేరకు బోరబండ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఇంట్లో నగలు, నగదు చోరీ

బోరబండ, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఇంటి తాళాలు పగలగొట్టి నగలు, నగదు అపహరించిన సంఘటన బోరబండ పోలీస్‌స్టేషన్ పరిధిలోని రాజీవ్‌నగర్ చౌరస్తాలో జరిగింది. బాధితుడు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బాలానగర్‌లోని ప్రైవేట్ సంస్థలో ఉద్యోగం చేసే కృష్ణాజిల్లా కూచిపూడి ప్రాంతానికి చెందిన వీరంకి అశ్విని కుమార్ రాజీవ్‌నగర్ కూడలిలోని ఓ భవనం పెంట్‌హౌస్‌లో ఉంటున్నారు. భార్య పుట్టింటికి వెళ్లడంతో సోమవారం ఉదయం ఇంటికి తాళం వేసి ఉద్యోగానికి వెళ్లాడు. సాయంత్రం తిరిగి వచ్చేసరికి ఇంటి తాళాలు పగలగొట్టి ఉన్నాయి. లోపలికి వెళ్లి చూడగా 16 గ్రాముల బంగారం బ్రాస్లెట్, ఒక తులం హారంతో పాటు రూ. 60వేల నగదు చోరీకి గురైనట్లు గుర్తించాడు. వెంటనే బోరబండ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. డీఐ జి.సైదులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మానసిక రోగి ఆత్మహత్య

బోరబండ, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): మానసిక స్థితి సరిగాలేని ఓ మహిళ ఆత్మహత్య చేసుకుంది. ఈ సంఘటన బోరబండ పోలీస్‌స్టేషన్ పరిధిలోని వెంగళరావునగర్ కాలనీలో జరిగింది. ఎస్ఐ శేరి స్వప్నారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. వెంగళరావునగర్ కాలనీ కమాన్ వద్ద నివసించే ఎ.సౌజన్య కమల్(55) మానసిక సమస్యతో 20 ఏళ్లుగా బాధపడుతున్నారు. కొన్నేళ్లుగా బంజారాహిల్స్ ఆశ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. మూడు నెలల క్రితం డిప్రెషన్‌కు లోనయ్యారు. సోమవారం మధ్యాహ్నం భోజనం తెచ్చేందుకు ఆమె కొడుకు సందీప్ బయటకు వెళ్లి అరగంట తర్వాత తిరిగి వచ్చే సరికి సౌజన్య కమల్ ఉరేసుకుంది. వెంటనే 108కు ఫోన్ చేసి సమీపంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లగా అప్పటికే ఆమె మృతిచెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. సందీప్ ఫిర్యాదు మేరకు బోరబండ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



బోరబండలో జరిగిన బీఆర్ఎస్ బూత్ కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద



బోరబండ డివిజన్ బంజారానగర్ కొమురం భీమ్ కమ్యూనిటీ హాల్లో కాంగ్రెస్ పార్టీ బూత్ స్థాయి నాయకుల సమావేశం నిర్వహించారు. ఉప ఎన్నికలో కాంగ్రెస్ అభ్యర్థి గెలుపు కోసం కృషి చేయాలని రాష్ట్ర ఇరిగేషన్ కార్పొరేషన్ చైర్మన్ మువ్వా విజయ్‌బాబు పిలుపునిచ్చారు. సమావేశంలో కార్పొరేటర్ ఎం.డి.బాబా ఫసియుద్దీన్ పాల్గొన్నారు



'జనంతో మమేకం' కార్యక్రమంలో భాగంగా హెచ్ఎఫ్‌నగర్‌లో గడపగడప తిరిగి కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, ప్రజల సమస్యలను తెలుసుకుంటున్న రహ్మత్ నగర్ కార్పొరేటర్ సి.ఎన్.రెడ్డి



మాజీ మంత్రి మోత్కుపల్లి నర్సింహులును కలిసిన కాంగ్రెస్ పార్టీ జూబ్లీహిల్స్ నియోజకవర్గ ఎస్సీ విభాగం చైర్మన్‌గా నియమితులైన బోడ రామచందర్, ఎర్ర కృష్ణకుమార్, నరేష్, విజయ్ కుమార్

28న తెలుగు సినీ, డిజిటల్ ఆర్టిస్ట్ యూనియన్ ఎన్నికలు

బంజారాహిల్స్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): తెలుగు ఫిలిం ఫెడరేషన్ అనుబంధ సంఘాలలో ఒకటైన తెలుగు సినీ అండ్ డిజిటల్ ఆర్టిస్ట్ యూనియన్ 2025-2027 కార్యవర్గ ఎన్నికలు ఈనెల 28న జరుగుతాయని ఎన్నికల అధికారి వల్లభనేని అనిల్ తెలిపారు. తెలుగు ఫిలిం ఫెడరేషన్ ఫిలిం ప్రొడ్యూసర్ కౌన్సిల్ హాల్‌లో బ్యాలెట్ పద్ధతిలో అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శి, కోశాధికారిని ఎన్నుకోవాల్సి ఉంటుందని ఆయన తెలిపారు. ఈ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరగడానికి సభ్యులందరూ సహకరించాలని ఆయన కోరారు.

వివాహితను వేధిస్తున్న సేల్స్‌మన్‌కు రిమాండ్

బోరబండ, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఇన్‌స్టాగ్రామ్‌లో పరిచయమైన వివాహితను వేధిస్తున్న సేల్స్‌మన్‌ను బోరబండ పోలీసులు మంగళవారం అరెస్ట్ చేసి న్యాయమూర్తి ఎదుట హాజరు పరిచారు. ఎస్ఐ శేరి స్వప్నారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. ఫలక్‌నుమా జంగమ్మెట్‌కు చెందిన సేల్స్‌మన్ సయ్యద్ అజహర్ అలీ(34)కు ఇటీవల ఇన్‌స్టాగ్రామ్‌లో ఎర్రగడ్డ నేతాజీనగర్‌కు చెందిన వివాహితతో పరిచయమైంది. ఆమెకు ఫోన్ చేసి వేధించడం, వెంటపడడం చేస్తుండడంతో విసిగిపోయిన వివాహిత బోరబండ పోలీసులకు ఫిర్యాదు చేసింది. దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు అజహర్ అలీని అరెస్టు చేసి న్యాయమూర్తి ఎదుట హాజరు పరిచారు.

వేర్వేరు కారణాలతో ఇద్దరి అదృశ్యం

బోరబండ, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): వేర్వేరు కారణాలతో వేర్వేరు ప్రాంతాలకు చెందిన ఇద్దరు అదృశ్యమయ్యారు. పోలీసులు కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ద్విచక్ర వాహనంపై వస్త్రాలు విక్రయించే నక్కా కిష్టయ్య(70)కు రెండేళ్ల కిందట పక్షవాతం రావడంతో ఇంటికే పరిమితమయ్యాడు. మాటలు సరిగ్గా రాని అతడికి మతిస్థిమితం కూడా సరిగా లేదు. బోరబండ సైట్-3 కాలనీలో ఉంటున్న పెద్ద కుమారుడు పెద్దయ్య వద్దకు కిష్టయ్య ఆదివారం వచ్చాడు. సోమవారం మధ్యాహ్నం పెద్దయ్య వ్యాపారానికి వెళ్లిన సమయంలో ఇంటి నుంచి బయటకు వెళ్లిన కిష్టయ్య తిరిగి రాలేదు. దీంతో పెద్దయ్య బోరబండ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

టీ తాగేందుకు వెళ్లి..

బోరబండ సంజయ్ నగర్‌కు చెందిన జి.నర్సింహులు(60) టీ తాగేందుకు గత నెల 9న శ్రీరామ్‌నగర్ వెళ్లి తిరిగి రాలేదు. దీంతో ఆయన కుమారుడు మల్లేశ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. నర్సింహులు తరచూ ఇంటి నుంచి వెళ్లిపోయి వారం, పది రోజుల తర్వాత తిరిగి వచ్చే వాడని ఫిర్యాదులో పేర్కొన్నాడు.



షేక్‌పేటలో భవనాన్ని సీజ్ చేసిన అధికారులు

అనుమతికి మించి నిర్మిస్తే కూల్చివేత : డీసీ

ఖైరతాబాద్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): అనుమతికి మించి నిర్మాణాలు చేస్తే కూల్చివేతలు తప్పవని జీహెచ్ఎంసీ సర్కిల్-18 ఉప కమిషనర్ సమ్మయ్య హెచ్చరించారు. మంగళవారం షేక్ పేటలో జి ప్లస్2కు అనుమతి తీసుకొని అక్రమంగా 3, 4, 5 అంతస్తులతో పాటు పెంట్‌హౌస్ నిర్మాణం చేస్తున్న రెండు భవనాలను పోలీసుల సహకారంతో సీజ్ చేశామని సమ్మయ్య, టౌన్‌ప్లానింగ్ ఏసీపీ శ్రీనివాస్ తెలిపారు.

ఎర్రగడ్డలో ఓటరు నమోదు

ఎర్రగడ్డ, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక నేపథ్యంలో ఓటరు నమోదు ప్రక్రియ మంగళవారం ప్రారంభమైంది. హేమవతి నగర్‌లోని పోలింగ్ బూత్‌లకు సంబంధించిన ఇళ్లలో ఓటరు నమోదు కార్యక్రమాన్ని మున్సిపల్ అధికారులు చేపట్టారు. ఈ సందర్భంగా మున్సిపల్ సూపర్‌వైజర్ బబ్లు మాట్లాడుతూ ఓటరు నమోదు, మార్పులు, చేర్పులు చేపట్టామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ ఎస్ఎఫ్ఏలు శ్రీనివాస్, హేమలత పాల్గొన్నారు.











పారిశుధ్య కార్మికులకు సేఫ్టీ కిట్లను అందజేస్తున్న అడ్డగుట్ట డివిజన్ కార్పొరేటర్ లింగాని ప్రసన్నలక్ష్మి

కార్మికులకు సేఫ్టీ కిట్స్ అందజేత

అడ్డగుట్ట, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : అడ్డగుట్టను చెత్తరహిత ప్రాంతంగా, పరిశుభ్రత కలిగిన ప్రదేశంగా తీర్చిదిద్దేందుకు అన్నివిధాలా కృషి చేస్తానని అడ్డగుట్ట డివిజన్ కార్పొరేటర్ లింగాని ప్రసన్నలక్ష్మి అన్నారు. మంగళవారం అడ్డగుట్ట డివిజన్‌లో కార్పొరేటర్ కార్యాలయం వద్ద జీహెచ్ఎంసీ పారిశుధ్య కార్మికులకు ఆమె సేఫ్టీ కిట్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రతను ప్రజలు సామాజిక బాధ్యతగా తీసుకుని భాగస్వాములు కావాలని సూచించారు. పరిసరాలను శుభ్రం చేసే కార్మికుల ఆరోగ్యం దృష్ట్యా సేఫ్టీగా ఉండాలని కిట్లను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు.



డ్రైనేజీ పనులను ప్రారంభిస్తున్న బోర్డు నామినేటెడ్ సభ్యురాలు భానుక నర్మద

మౌలిక వసతుల కల్పనకు కృషి : భానుక నర్మద

తిరుమలగిరి సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): కంటోన్మెంట్ బోర్డు పరిధిలోని అన్ని ప్రాంతాలను అభివృద్ధి చేస్తున్నామని కంటోన్మెంట్ బోర్డు నామినేటెడ్ సభ్యురాలు భానుక నర్మద అన్నారు. మంగళవారం బొల్లారం సదర్‌బజార్‌లోని పెద్దమ్మబస్తీలో రూ.14లక్షలతో నిర్మించనున్న డ్రైనేజి పనులను ఆమె ప్రారంభించారు. ఎన్నో ఏళ్లుగా ఈ బస్తీలో నెలకొన్న సమస్య గుర్తించి బోర్డు నిధులు వెచ్చించి పనులు చేపట్టామని ఆమె అన్నారు. బోర్డు పరిధిలోని బస్తీలు, కాలనీలు, మురికివాడలను అభివృద్ధి చేసుకుంటూ ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతున్నామన్నారు. మల్కాజిగిరి పార్లమెంటు సభ్యులు ఈటల రాజేందర్ సహకారంతో అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకుడు భానుక మల్లిఖార్జున్, వార్డ్-8 అధ్యక్షులు ప్రవీణ్‌కుమార్, జేవి నర్సింగరావు, బస్తీ వాసులు వినోద్, ప్రమోద్, హేమంత్ శెట్టి, కిషోర్, సంజయ్, స్వామి తదితరులు ఉన్నారు.

ఉమేశ్ ఖండేల్‌వాల్ మృతికి సానుభూతి

పద్మారావునగర్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): బన్సీలాల్‌పేట్ భారతీయ జనతా పార్టీ సీనియర్ నాయకులు, డివిజన్ మాజీ అధ్యక్షులు ఉమేశ్ ఖండేల్‌వాల్(56) మృతి చెందారు. గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన సోమవారం పద్మారావునగర్‌లోని ఆయన నివాసంలో మృతి చెందారు. కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, మాజీ హర్యాణ గవర్నర్ బండారు దత్తాత్రేయ ఉమేష్ కుటుంబ సభ్యులను ఫోన్‌లో పరామర్శించి, తమ సానుభూతిని తెలిపారు. స్థానిక నాయకుల ద్వారా విషయం తెలుసుకొన్న బీజేపీ సికింద్రాబాద్, మహంకాళి జిల్లా అధ్యక్షులు భరత్‌గౌడ్, మాజీ అధ్యక్షులు బూర్గుల శ్యాంసుందర్‌గౌడ్, రాష్ట్ర ఉపాధ్యక్షురాలు బండ కార్తీకరెడ్డి, సికింద్రాబాద్ పార్లమెంటు కన్వీనర్ రాజశేఖరరెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రవిప్రసాద్‌గౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల సారంగపాణి, ఉపాధ్యక్షులు రాచమల్ల కృష్ణమూర్తి, హరినాథ్‌నాయి, యువనాయకులు మర్రి పురూరవరెడ్డి, హరి, వై.సురేష్‌కుమార్, వై.శ్రీనివాస్, సత్యనారాయణ, స్థానిక నాయకులు ఉమేష్ పార్థీవ దేహంపై పూలమాలలు వేసి నివాళులర్పించి, సానుభూతిని తెలిపారు. మంగళవారం కవాడిగూడలోని శ్మశానవాటికలో అంత్యక్రియలు నిర్వహించారు.

మేధా స్కూల్ విద్యార్థులను ఆదుకోండి: సీపీఎం

ఓల్డుబోయినపల్లి, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఓల్డుబోయినపల్లిలోని మేధా స్కూల్ విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని వారికి నచ్చిన స్కూళ్లలో చేర్పించాలని సీపీఎం నేతలు విద్యాశాఖ అధికారులను కోరారు. మేధా స్కూల్‌లో అల్ప్రాజోలం తయారు చేయడాన్ని నిరసిస్తూ మంగళవారం సీపీఎం బాలానగర్ మండల కమిటీ నాయకులు పాఠశాల ఎదుట నిరసన వ్యక్తం చేశారు. పాఠశాలలో చదువుతున్న 63 మంది విద్యార్థుల విద్యా సంవత్సరం వృథా కాకుండా చూడాలని సంబంధిత అధికారులను, ప్రభుత్వాన్ని వారు కోరారు. ఇప్పటికైనా ప్రభుత్వం మేల్కొని ప్రైవేట్ స్కూళ్లలో విస్తృత తనిఖీలు చేపట్టాలని డిమాండ్ చేశారు. స్కూల్‌లో మత్తు పదార్థ తయారీ కేంద్రం విషయం వెలుగులోకి వచ్చినప్పటికి స్థానిక కార్పొరేటర్ స్పందించకపోవడంలో ఆంతర్యమేంటని నేతలు అనుమానం వ్యక్తం చేశారు. కార్పొరేటర్ తక్షణమే స్పందించాలని వారు డిమాండ్ చేశారు. సీపీఎం మేడ్చల్ జిల్లా కార్యదర్శి సత్యం, జిల్లా కార్యవర్గ సభ్యుడు ఐలాపురం రాజశేఖర్, మేడ్చల్ జిల్లా నాయకులు శంకర్, మండల కమిటీ సభ్యులు వెంకటనర్సయ్య, శ్రీధర్, జగన్, రాము, ప్రభాకర్‌రెడ్డి, నర్సింగ్ పాల్గొన్నారు.

ఘనంగా ఎం.ఎస్. సుబ్బులక్ష్మి జయంతి

చిలకలగూడ, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): కర్ణాటక సంగీత విద్వాంసురాలు, భారతరత్న ఎం.ఎస్. సుబ్బులక్ష్మి 108వ జయంతి వేడుకలను సికింద్రాబాద్, ఈస్ట్‌మారేడుపల్లి, శ్రీభక్త రామదాసు ప్రభుత్వ సంగీత, నృత్య కళాశాలలో నిర్వహించారు. తొలుత ఆమె చిత్రపటానికి పూలమాల వేసిన అనంతరం ప్రిన్సిపాల్ మహావాది సరిత మాట్లాడుతూ కర్ణాటక సంగీతానికి ప్రపంచవ్యాప్త గుర్తింపు తెచ్చిన ఆమె సేవలు మరువలేనివని, ఆమె పాడిన భక్తిగీతాలు నిత్యనూతనంగా, ప్రతి ఇంట్లో ఆలయాల్లో మారుమోగుతున్నాయని పేర్కొన్నారు. ప్రిన్సిపాల్, విద్యార్థులు, లెక్చరర్లతో కలిసి గణేశ పంచరత్నాలు, అన్నమాచార్య, త్యాగరాజ కృతులను రాగ, భావయుక్తంగా గానం చేసి అలరించారు. వ్యాఖ్యతగా ప్రశాంత్ వ్యవహరించగా, లెక్చరరు దయాసాగర్, విద్యార్థులు పాల్గొన్నారు.

నవంబరులో సైక్లోథాన్ పోటీలు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): హెచ్‌సీఏల్ సైక్లోథాన్ పోటీలును వచ్చే నవంబరు 9వ తేదీన హైదరాబాద్ వేదికగా జరగనున్నాయి. మంగళవారం బేగంపేటలోని ఒక హోటల్‌లో జరిగిన ఈ పోటీల జెర్సీ ఆవిష్కరణ కార్యక్రమానికి రాష్ట్ర ప్రభుత్వ క్రీడాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ జయేష్ రంజన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సైక్లింగ్ క్రీడ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందని చెప్పారు. ఈ పోటీలకు ఆతిథ్యం ఇచ్చేందుకు ప్రభుత్వం నుంచి అన్ని విధాలా సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. జాతీయ సైక్లింగ్ ఫెడరేషన్ (సీఎఫ్ఐ) సహకారంతో ప్రొఫెషనల్, అమెచ్యూర్, గ్రీన్ రైడ్ అనే మూడు విభాగాల్లో పోటీలు నిర్వహిస్తున్నామని, మొత్తం ప్రైజ్ మనీ రూ.33 లక్షలని హెచ్‌సీఎల్ ప్రతినిధి రజత్ చండోలియా తెలిపారు.

కంటోన్మెంట్ పికెట్ పార్క్‌లో..

నేడు వాజ్‌పేయి విగ్రహావిష్కరణ

మారేడుపల్లి, సెప్టెంబర్ 16 (ఆంధ్రజ్యోతి): పికెట్ పార్కులో ఏర్పాటు చేసిన మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయ్ విగ్రహాన్ని నేడు (బుధవారం) రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ చేతుల మీదుగా విగ్రహావిష్కరణ జరగనుంది. ఉదయం పరేడ్ గ్రౌండ్స్‌లో తెలంగాణ విమోచన దినోత్సవ వేడుకల్లో పాల్గొన్న అనంతరం రాజ్‌నాథ్ సింగ్ కంటోన్మెంట్ పికెట్ పార్క్‌కు చేరుకుని విగ్రహావిష్కరణ కార్యక్రమంలో పాల్గొంటారని అధికార వర్గాలు తెలిపాయి.



అటల్ బిహారీ వాజ్‌పేయ్ పార్క్, ముఖద్వారం

ఏర్పాట్లు పూర్తి

విగ్రహావిష్కరణకు సంబంధించిన ఏర్పాట్లను మంగళవారం బోర్డు సీఈఓ మధుకర్ నాయక్, బోర్డ్ నామినేటెడ్ మెంబర్ భానుక నర్మదా మల్లిఖార్జున్, మాజీ బోర్డు నామినేటెడ్ మెంబర్ జె.రామకృష్ణ, కంటోన్మెంట్ బోర్డ్ ఉన్నతాధికారులు ఉమాశంకర్, ఫనికుమార్, దినేష్, దేవేందర్, మహేందర్ తదితర అధికారులు పరిశీలించారు. ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు అధికారులు తెలిపారు.

అటల్ బిహారీ వాజ్‌పేయి పార్క్‌గా నామకరణం

కంటోన్మెంట్ పికెట్ పార్క్ ఇక నుంచి అటల్ బిహారీ వాజపేయి పార్క్‌గా పిలువనున్నారు. దేశానికి ఆయన చేసిన సేవలను గుర్తిస్తూ సికింద్రాబాద్ కంటోన్మెంట్ పికెట్ పార్కులో దాదాపు 8 ఎకరాల స్థలంలో రూ.80 లక్షల వ్యయంతో పార్కును సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. 11 అడుగుల కాంస్య విగ్రహం చుట్టూ గ్రీనరీ ఏర్పాటు చేశారు. కంటోన్మెంట్‌కి వన్నె తీసుకొచ్చే విధంగా పార్కును అన్ని ఆర్భాటాలతో అభివృద్ధి చేయడం పట్ల కంటోన్మెంట్ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



పార్కులో సర్వాంగ సుందరంగా పూలమొక్కలు



అటల్ బిహారీ వాజ్‌పేయి 11 అడుగుల కాంస్య విగ్రహం

కంటోన్మెంట్‌లో మిని లుంబిని పార్క్ తరహాలో అభివృద్ధి చేయడం కంటోన్మెంట్ అధికారుల 10 నెలల కృషి ఫలితమేనని స్థానిక అభినందనలు వెల్లువెత్తుతున్నాయి. జూబ్లీ బస్‌స్టేషన్ పక్కనే ఏర్పాటు చేసిన అటల్ బిహారీ వాజ్‌పేయ్ పార్కు అందరినీ ఆకట్టుకోనుంది. పక్కనే జేబీఎస్ సమీపంలోనే పెరేడ్ గ్రౌండ్, జేబీఎస్, మెట్రో రైల్ స్టేషన్ల ప్రయాణికులకు సేద తీరేందుకు ఊరట కలుగనుందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

అక్రమ కట్టడాన్ని సీజ్ చేసిన అధికారులు

బౌద్ధనగర్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ జీహెచ్ఎంసీ సర్కిల్ కార్యాలయ పరిధిలో సీతాఫల్‌మండి డివిజన్ చిలకలగూడ శ్రీనివాస్‌నగర్‌లో అనుమతులకు విరుద్ధంగా కడుతున్న ఓ అక్రమ కట్టడాన్ని మంగళవారం టౌన్ ప్లానింగ్ అధికారులు సీజ్ చేశారు. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం శ్రీనివాస్‌నగర్‌లో జీహెచ్ఎంసీ పార్కు వెనుక ఓ భవన యజమాని రెండు అంతస్తుల నిర్మాణానికి టౌన్‌ప్లానింగ్ విభాగం నుంచి అనుమతి తీసుకున్నారు. రెండు అంతస్తులు నిర్మించటంతో పాటు అదనంగా నిబంధనలను అతిక్రమించి మరో మూడు అంతస్తులను అక్రమంగా నిర్మించాడు. ఈ విషయాన్ని స్థానికులు టౌన్ ప్లానింగ్ అధికారులకు ఫిర్యాదు చేశారు. జోనల్ కమిషనర్, డిప్యూటీ కమిషనర్ ఆదేశాల మేరకు అసిస్టెంట్ సిటీ ప్లానర్ పావని సమక్షంలో జీహెచ్ఎంసీ ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ బృందం, టౌన్ ప్లానింగ్ సిబ్బంది మంగళవారం భవనం వద్దకు చేరుకుని అదనంగా కట్టిన మూడు అంతస్తులను సీజ్ చేసినట్టు బ్యానర్‌ను ఏర్పాటు చేశారు. న్యాక్ ఇంజనీర్ ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు. ఈప్రాంతంలో మరో కొన్ని అక్రమ కట్టడాలను గుర్తించామని త్వరలో వాటిని సీజ్ చేస్తామని అధికారులు తెలిపారు.



పరేడ్‌గ్రౌండ్‌లో విమోచన దినోత్సవ రిహార్సల్స్

సికింద్రాబాద్ పరేడ్‌మైదానంలో నేడు నిర్వహించనున్న విమోచన దినోత్సవ వేడుకల రిహార్సల్స్ ఘనంగా నిర్వహించారు. తెలంగాణ రాష్ట్రం లోని పలు జిల్లాల నుంచి వచ్చిన కళాకారులు చెక్కభజన, కోలాటం, సన్నాయి మేళం, మాథూరి, లంబాడి నృత్యం, బతుకమ్మ, పోయా, మార్వా, బోనాలను కళాకారులు ప్రదర్శించారు.

- అడ్డగుట్ట, సెప్టెంబరు (ఆంధ్రజ్యోతి)



అమలు సాధ్యం కాని హామీలతో కాంగ్రెస్ మోసం : ఎమ్మెల్యే

రాంగోపాల్‌పేట్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : ఆచరణ సాధ్యం కాని హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రజలను మోసం చేస్తుందని మాజీమంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ ధ్వజమెత్తారు. మంగళవారం సికింద్రాబాద్ సర్దార్ పటేల్ రోడ్డులోని సికింద్రాబాద్ తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో సికింద్రాబాద్, అమీర్‌పేట్, ఖైరతాబాద్, ముషీరాబాద్ మండలాల పరిధిలోని 47 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ కింద మంజూరైన ఆర్థిక సహాయ చెక్కులను పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు కాంగ్రెస్ కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ లబ్ధిదారులకు అదనంగా తులం బంగారం ఇస్తామని హామీ ఇచ్చిందని, అధికారంలోకి వచ్చి 22 నెలలు అవుతున్నా అది నేటి వరకు అమలుకు నోచుకోలేదన్నారు. యూరియా కోసం రైతులు రోడ్ల పైకి వచ్చారని అన్నారు. ఖజానా ఖాళీ అని, హామీలు అమలు చేయలేమని ప్రజల వద్దకు వెళ్లి చెప్పే ధైర్యం ప్రభుత్వానికి ఉందాని ప్రశ్నించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు చీర సుచిత్ర, టి.మహేశ్వరి, కుర్మ హేమలత, మాజీ కార్పొరేటర్ నామన శేషుకుమారి, తహసీల్దార్ ఇస్లావత్ పాండునాయక్, డిప్యూటీ తహసీల్దార్ రజని, బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షులు ఆకుల హరికృష్ణ, హన్మంతరావు, వెంకటేషన్ రాజు, శ్రీనివాస్ గౌడ్, నాయకులు శ్రీహరి, తలసాని సైలాబ యాదవ్, నరేందర్, లక్ష్మీపతి, నాగులు మహేష్ యాదవ్, ప్రేమ్ కుమార్, నర్సింగం సతీష్, గణేష్, బీజేపి మహంకాళి సికింద్రాబాద్ జిల్లా అధికార ప్రతినిధి భైరిశెట్టి అశ్విని, నాయకులు మధన్, శ్రీనివాస్ యాదవ్, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.



లబ్ధిదారులను ఉద్దేశించి మాట్లాడుతున్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్



దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖకు ఆహ్వానపత్రికను అందజేస్తున్న ఈఓ మనోహర్‌రెడ్డి, ప్రధానార్చకులు రామతీర్థశర్మ, లక్ష్మీప్రసాద్‌శర్మ

మంత్రులకు ఆహ్వానం

సికింద్రాబాద్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ ఉజ్జయినీ మహాకాళి ఆలయంలో జరిగే శరన్నవరాత్రోత్సవాలకు రావాల్సిందిగా ఆలయ కార్యనిర్వహణాధికారి మనోహర్‌రెడ్డి, ప్రధానార్చకులు బి.రామతీర్థశర్మ, వేదపండితులు లక్ష్మీప్రసాద్‌లు మంగళవారం హైదరాబాద్ ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్, దేవాదాయశాఖమంత్రి కొండా సురేఖను కలిసి ఆహ్వానపత్రికలు అందజేశారు.

ఉత్సవాలకు ఆలయాలు ముస్తాబు

తిరుమలగిరి సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): బొల్లారం, తిరుమలగిరి పరిసర ప్రాంతాల్లో 22 నుంచి వచ్చే నెల 2 వరకు జరగనున్న దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలకు బొల్లారం డౌటన్‌బజార్‌లోని తోట ముత్యాలమ్మ దేవాలయం లాల్‌బజార్ లోని శ్రీ మహంకాళి దేవాలయాలను నిర్వాహకులు ముస్తాబు చేస్తున్నారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని వసతులు కల్పిస్తున్నారు. బొల్లారం లోని తోట ముత్యాలమ్మ దేవాలయంలో అమ్మవారు 9 రోజుల పాటు 9 అలంకారాల్లో భక్తులకు దర్శనం ఇస్తుందని. పూజారి చిక్కాల మహేష్ కుమార్ తెలిపారు. తిరుమలగిరి లాల్‌బజార్‌లోని మహంకాళి దేవాలయంలో కూడా ఉత్సవాలను ఘనంగా నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు చేశామని ఈఓ సత్యచంద్ర రెడ్డి, దేవాలయం కమిటీ అధ్యక్షులు మురళీ ముదిరాజ్ తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి అమ్మవారిని దర్శనం చేసుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొనాలని కోరారు.

యజ్ఞ మహోత్సవానికి ఆహ్వానం

రాంగోపాల్‌పేట్, సెప్టెంబర్ 16 (ఆంధ్రజ్యోతి) : సికింద్రాబాద్ సోమసుందరం వీధిలోని విశ్వకర్మ సంఘ భవనంలో సంఘం అధ్వర్యంలో శ్రీ విరాట్ విశ్వకర్మ భగవానుని యజ్ఞ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు చేసినట్లు సంఘం అధ్యక్షుడు గోపాలపురం ప్రకాష్, ప్రధాన కార్యదర్శి గిర్మాపురం భాస్కరాచారిలు ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం సంఘ భవనంలో ఉపాధ్యక్షుడు కటకం చక్రపాణి, కోశాధికారి బోనాల శ్రీనివాస్‌లతో కలిసి విలేకరులతో మాట్లాడుతూ యజ్ఞ మహోత్సవం సందర్భంగా ఉదయం ధ్వజారోహణ, జ్యోతి ప్రజ్వలన, శ్రీమహాగణపతి పూజ, విశ్వకర్మ భగవానుని యజ్ఞం, ఊరేగింపు, మహానైవేద్యం, ప్రసాద వితరణ ఉంటాయని వివరించారు. ఇప్పటికే కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్, కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్, ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్ కుమార్, కార్పొరేటర్ చీర సుచిత్ర శ్రీకాంత్‌లకు అలాగే సంఘ పెద్దలైన హైకోర్టు న్యాయవాది పాలసగిరి క్రిష్ణ, వ్యాపారవేత్త బుధారం సుధాకర్ చారి, పారిశ్రామికవేత్త జీఆర్ సూర్యరాజ్, అడ్వకేట్ రాగి విక్రమ్‌లకు ఆహ్వాన పత్రికలను అందించి ఆహ్వానించామని తెలిపారు. వీరితో పాటు పలువురు రాజకీయ నాయకులు, కుల పెద్దలు, సంఘం సభ్యులు పెద్దఎత్తున ఈ మహోత్సవంలో పాల్గొంటారని వివరించారు.



ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్ కుమార్‌కు ఆహ్వాన పత్రికను అందజేస్తున్న విశ్వకర్మ సంఘ నాయకులు



సీఐ శ్రీకాంత్‌రెడ్డికి వినతిపత్రం సమర్పిస్తున్న పహాడి హనుమాన్ ఆలయ ధర్మకర్తలు

పండుగలకు బందోబస్తు ఏర్పాటు చేయండి

అడ్డగుట్ట, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : దేవి నవరాత్రులు, బతుకమ్మ, దసరా పండుగల సందర్భంగా తుకారాంగేట్‌లోని పహాడి హనుమాన్ ఆలయం వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని కోరుతూ ఆలయ చైర్మన్ లక్ష్మణ ప్రసాద్‌తో పాటు ఆలయ ధర్మకర్తలు మంగళవారం తుకారాంగేట్ పోలీస్ స్టేషన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ శ్రీకాంత్‌రెడ్డిని కలిసి వినతిపత్రం సమర్పించారు. 22 నుంచి అక్టోబరు 2 వరకు ఆలయాల పరిసర ప్రాంతాల వద్ద పండుగ వాతావరణం ఉంటుందని, రాష్ట్ర మంత్రులు ఎమ్మెల్యేలు పూజా కార్యక్రమాలకు హాజరవుతారని సీఐ దృష్టికి తీసుకొచ్చారు. సీఐని కలిసిన వారిలో ఆలయ ధర్మకర్తలు లలిత్ కుమార్ విష్ణు ప్రకాశ్, సంతోష్ కుమార్‌లతో పాటు పలువురు ఉన్నారు.



రోడ్డు పనులను పరిశీలిస్తున్న కమిషనర్ కర్ణన్, ఎంపీ రఘునందన్‌రావు

రహదారి విస్తరణ పనులు త్వరితగతిన పూర్తి చేయాలి..!

- కమిషనర్ కర్ణన్

హైదరాబాద్ సిటీ, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): రహదారి విస్తరణ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్‌వీ కర్ణన్ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. లింగంపల్లి చౌరస్తా నుంచి అమీన్‌పూర్, సుల్తాన్‌పూర్ రోడ్డు విస్తరణ పనులను స్థానిక ఎంపీ ఎం.రఘునందన్‌రావుతో కలిసి మంగళవారం ఆయన పరిశీలించారు. అమీన్‌పూర్ వద్ద నాలాపై బ్రిడ్జి నిర్మాణం చేపట్టి ప్రధాన రహదారికి అనుసంధానిస్తే రాకపోకలకు సౌలభ్యంగా ఉంటుందని రఘునందన్‌రావు కోరారు. దీనికి సానుకూలంగా స్పందించిన కర్ణన్ ఆ దిశగా కార్యాచరణ ప్రారంభించాలని సూచించారు. ఈ రహదారి పూర్తయితే అమీన్‌పూర్, సుల్తాన్‌పూర్, బొల్లారం ప్రజలతోపాటు శేరిలింగంపల్లి వాసులకు ఔటర్ రింగ్ రోడ్డు ప్రయాణం మరింత సులభతరం అవుతుందని పేర్కొన్నారు.



విద్యుత్‌శాఖ అధికారులతో పాపడ్ అశోక్

విద్యుత్‌శాఖ అధికారుల బస్తీబాట

రాంగోపాల్‌పేట్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ విద్యుత్ పంపిణీ వ్యవస్థ సీఎండీ ఆదేశాల మేరకు మంగళవారం సికింద్రాబాద్ జనరల్‌బజార్ సెక్షన్‌లో విద్యుత్‌శాఖ అధికారులు బస్తీబాట నిర్వహించారు. ఈ సందర్భంగా జనరల్‌బజార్ సెక్షన్ ఏఈ కాసం రవికుమార్ విద్యుత్ సమస్యల గురించి స్థానికులను అడగగా అక్కడే ఉన్న ఎంఐఎం డివిజన్ అధ్యక్షుడు లాలాటెంపుల్ దగ్గర ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌కు కంచె వేయాల్సిన అవసరం ఉందని అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. ట్రాన్స్‌ఫార్మర్ వద్ద చెత్త వేయరాదని అధికారులు స్థానికులను కోరారు.

వరద బాధితులను ఆదుకోండి

అడ్డగుట్ట, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : కంటోన్మెంట్ నియోజకవర్గం రైల్ నిలయం అంబేద్కర్‌నగర్ బస్తీలో ఇటీవల కురిసిన భారీవర్షం కారణంగా ఇళ్లలోకి నీరు చేరి దుర్భర పరిస్థితికి చేరుకున్న బాధిత కుటుంబాలను ఆదుకోవాలని ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ సీనియర్ నాయకుడు రౌతు రాజయ్య మంగళవారం మారేడుపల్లి డిప్యూటీ తహసీల్దార్ రాజు నాయక్‌కు వినతిపత్రం సమర్పించారు. గతంలో కూడా ఇదే పరిస్థితి నెలకొందని, ప్రభుత్వం నుంచి సాయం అందించాలని వినతి పత్రంలో పేర్కొన్నారు.

కోణార్క్ ఎక్స్‌ప్రెస్ రైలులో గంజాయి పట్టివేత

పాడేరు టు మహారాష్ట్రకు సరఫరా

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : రైల్వే స్టేషన్‌లో మహిళ నుంచి 8 కిలోల గంజాయి సరుకును సికింద్రాబాద్ రైల్వే, సికింద్రాబాద్ ఆర్పీఎస్ పోలీసులు పట్టుకున్నారు. మంగళవారం జీఆర్పీ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో రైల్వే డీఎస్పీ జావెద్, సికింద్రాబాద్ రైల్వే ఇన్‌స్పెక్టర్ సాయి ఈశ్వర్‌గౌడ్‌లు వివరాలను వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్ అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు ప్రాంతానికి చెందిన బొబ్బరాల లక్ష్మి(40) అదే ప్రాంతానికి చెందిన బోన్యా ఇద్దరు బాగా పరిచయస్తులు. లక్ష్మి ఆర్థిక ఇబ్బందులు కారణంగా బోన్యా తన వద్ద వ్యాపారం ఉందని తాను ఇచ్చే గంజాయిని మహరాష్ట్రలో ఒకరికి అప్పగిస్తే చాలు రానుపోను ఖర్చులతో పాటు మూడువేల రూపాయలు ఇస్తానని చెప్పడంతో సరేనని ఒప్పుకుంది.

గతంలో లక్ష్మిపై విశాఖపట్నంలోని శృంగవరపుకోట పోలీస్‌స్టేషన్‌లో రెండుసార్లు పలు కేసుల్లో జైలు శిక్ష అనుభవించింది. బోన్యా ఆమెకు నాలుగు గంజాయి ప్యాకెట్లు ఉన్న బ్యాగును అప్పగించి విశాఖపట్నంలో కోణార్క్ ఎక్స్‌ప్రెస్ రైలు ఎక్కించాడు. సోమవారం సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌లో రోజు తరహాలోనే జీఆర్పీ ఎస్సై రమేష్‌తో పాటు కానిస్టేబుళ్లు సత్యనారాయణ, విజయమ్మ, ఆశీర్వాదం, రజిత, తులసీ నాయుడు, భవానీ శంకర్‌లతో పాటు సికింద్రాబాద్ ఆర్పీఎఫ్ సీఐ సరస్వత్, ఎస్సై సుబ్బారావులు కలిసి రైల్వేస్టేషన్‌కు చేరుకున్న కోణార్క్ ఎక్స్‌ప్రెస్ రైలులో సంయుక్తంగా తనిఖీలు నిర్వహించారు. తనిఖీల్లో భాగంగా రిజర్వేషన్ బోగిలో ఉన్న లక్ష్మి వద్దకు చేరుకున్న పోలీసులు ఆమె బ్యాగును సోదా చేయగా 8 కిలోల గంజాయి ఉన్నట్లు తెలుసుకుని ఆమెను అదుపులోకి తీసుకుని విచారించగా బోన్యా అనే వ్యక్తి సరుకు ఇచ్చాడని విచారణలో ఒప్పుకుంది. ప్రస్తుతం బోన్యా పరారీలో ఉన్నాడని రైల్వే పోలీసులు తెలిపారు. నిందితురాలి నుంచి సరుకు స్వాధీనం చేసుకుని అరెస్టు చేసి రిమాండుకు తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.



గంజాయి, నిందితురాలిని చూపుతున్న రైల్వే డీఎస్పీ జావెద్, సీఐ సాయి ఈశ్వర్‌గౌడ్



మజ్దూర్ యూనియన్ జాతీయ కార్యాలయంలో మాట్లాడుతున్న యూనియన్ ప్రధాన కార్యదర్శి సిహెచ్ శంకర్ రావు

కార్మికుల సంక్షేమానికి కృషి

సికింద్రాబాద్ రైల్వేస్టేషన్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : రైల్వే కార్మికుల సంక్షేమం కోసం ప్రత్యేక దృష్టి పెడుతున్నానని రైల్వే మజ్దూర్ యూనియన్ ప్రధాన కార్యదర్శి సిహెచ్ శంకర్ రావు తెలిపారు. మంగళవారం రైల్వే యూనియన్ జాతీయ కార్యాలయంలో జరిగిన కార్మిక విద్యా దినోత్సవం కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మిక విద్యా ప్రాధాన్యం, కార్మికుల అభివృద్ధి వంటి అంశాలపై సూచించారు. కార్యక్రమంలో యూనియన్ నేతలు పాల్గొన్నారు.